

పేదలకు దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న హుమయూన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిం సోదరుల పవిత్ర పండుగ రంజాన్ మాసం సందర్భంగా శనివారం పట్టణ కేంద్రంలోని మన్నూరులో 300 మంది నిరుపేద కుటుంబాలకు ముస్లిం మైనార్టీ నాయకులు గగ్గుటూరి హుమయూన్, గగ్గుటూరి జావిద్ బాషా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసం సందర్భంగా పేద ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మా తాత గగ్గుటూరి ఉత్తయ్య కోరిక మేరకు నిత్యావసర వస్తువులతో పాటు పురుషులకు చొక్కా, లుంగీ, మహిళలకు చీరలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. రంజాన్ పండుగను పేద ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేశామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రేపటి నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలుంటాయని, విద్యాశాఖ, పోలీసుశాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. దీంతో పాటు 121 పరీక్షా కేంద్రాలలో మొత్తం 22,355 మంది విద్యార్థులు హాజరు అవుతారని, ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడానికి వీలుగా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లలో సభ్యులుగా వ్యవహరించడానికి 11 మంది డిప్యూటీ తహశీల్దార్లను నియమించామని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ప్రకటించాలని సూచనలు జారీ చేశామన్నారు. పరీక్షా సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలను సకాలంలో చేరుకోవడానికి, విద్యార్థులు వారి ఇళ్లకు తిరిగి వెళ్లడానికి పరీక్షకు ముందు, తరువాత జిల్లా విద్యా శాఖ అధికారి ఇచ్చిన పరీక్షా కేంద్రాల మార్గాలలో ఆర్‌టిసి అధికారులు మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్‌కో డిస్కమ్ అధికారులు (విద్యుత్ శాఖ) పరీక్షా సమయంలో (ముఖ్యంగా రాత్రి సమయంలో) విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావడానికి వీలుగా, పరీక్షా సమయంలో జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతిరోజూ సాయంత్రం 04.00 గంటల వరకు తీసుకువచ్చిన సీల్డ్ సమాధాన పత్రాల బండిల్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ తమ వద్ద ఉంచుకోకుండా అదే రోజున పంపించాలని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, అన్ని పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించారని తెలిపారు. . కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఎఎస్పి వెంకటాద్రి, డిఆర్ఒ మధుసుధన్‌రావ్, డిఆర్ఒ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే ధ్యేయం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే తమ ధ్యేయమని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజులలో పేదరికం లేని సమాజ స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తారన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి అందిన కొన్ని సమస్యలను మంత్రి అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించారు. **యశోద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం**.. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నూతనంగా నిర్మించిన యశోద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అందరికీ అందుబాటులో యశోద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు.రాబోయే రోజులలో ఆసుపత్రి దినదినాభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. మందుగా ఆసుపత్రి నిర్వాహకులు మంత్రిని గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నమండెం : తాగునీరు మోటార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సిమెంట్ రోడ్లకు మంత్రి భూమిపూజ

చిన్నమండెం : ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మోతినగర్‌లో రూ.7.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేశామన్నారు. మోతినగర్‌లో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించామన్నారు. అనంతరం మంత్రి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మోటారును స్విచ్ ఆన్ చేసి గ్రామానికి నీటి సరఫరా చేశారు.


పరీక్ష సామగ్రితో విద్యార్థులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - రాయచోటి

జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కస్తూరిబా బాలికల వసతి గృహంలోని పదో తరగతి చదువుకుంటున్న 50 మంది విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థినులందరికీ ముందుగానే శుభాకాంక్షలు తెలియజేస్తూ చక్కగా చదువుకోవాలని పేర్కొన్నారు. బిసి వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట రమణ యాదవ్ మాట్లాడుతూ చదివే భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్రబాబు మాట్లాడుతూ బిసి సంఘం సభ్యులను విద్యార్థినులకు పరిచయం చేస్తూ చదువే ఒక ఆయుధమని, ఎన్ని ఆటంకాలు వచ్చినా చదువును కొనసాగాలని తెలియజేశారు. ప్రిన్సిపల్ జి.వి. రమణ మాట్లాడుతూ చదువు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో దాత జి నాగేంద్రబాబు యాదవ్, ఉపాధ్యాయుల సంకారామయ్య, మల్లికార్జున, జయరాం, వేయల వెంకటరమణ యాదవ్, నాగేశ్వర, వై.వి శివయ్య పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి -రాయచోటి :వినియోగదారుడా మేలుకో నీ హక్కులు తెలుసుకోవాలని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక డైట్ కళాశాల ఆడిటోరియంలో డిఎస్ఒ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రారెడ్డి మాట్లాడుతూ తుకాల్లో తేడాలు, ధరల్లో వ్యత్యాసాలు, నాణ్యతలో మార్పులు ఇలా కొనుగోలుదారుడు అనునిత్యం మోసపోతూనే ఉన్నారని తెలిపారు. చిన్న పాన్‌షాప్ మొదలుకొని పెద్ద షోరూమ్ వరకు జిల్లాలో లెక్కకు మించి మోసాలు జరుగుతున్నాయని, వాటి పట్ల అవగాహన లేకనే ఇలా జరుగుతున్నాయని అన్నారు. హక్కులు ఉల్లంఘిస్తే పరిష్కారం కోరే హక్కు వినియోగదారునికి ఉందన్నారు. దేశంలో ఎక్కడ వస్తువు కొన్నా ఎక్కడ సేవా లోపం ఉన్నా ఆ వినియోగదారుడు నివసించే ప్రదేశం, ఉద్యోగం చేసే జిల్లా పరిధిలో కమిషన్‌కు పిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్ఒ రఘురామ్, ఫుడ్ సేఫ్టీ అధికారి షమీమ్ బాషా, తూనికల అధికారి నాగరాజు, సామాజిక కార్యకర్త సోమల రాజు జనార్దన్ రాజు, ఎపిసిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకల దర్బార్ బాషా, సభ్యులు శంకర్ రెడ్డి, అల్లా బకాష్, ఈశ్వరి, వరలక్ష్మి, సుధా, కన్స్యూమర్ కమిటీ సభ్యులు జమాల్ బాషా, లాయర్ రవి, శంకర్ పాల్గొన్నారు. **మదనపల్లె:** వినియోగదారుల హక్కుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగం గ్రామీణ వర్గాలలో వినియోగదారుల హక్కుల గురించి అవగాహన పెంచడానికి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని చంద్రమాకులపల్లి సచివాలయం వద్ద గ్రామస్థులకు వివరించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

జిల్లా ప్రణాళికలను సిద్ధం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రణాళికకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలకు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు డాక్యుమెంటరీ సిద్ధం చేసి సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాల పైన దృష్టి సారించాలని చెప్పారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ రూపకల్పన చేసుకోవాలని పేర్కొన్నారు. లక్ష్యాలకు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రణాళికలో భాగంగా ఆయా శాఖలలో అమలు చేయాల్సిన ప్రధానమైన కార్యక్రమాలు లక్ష్యసాధనకు తీసుకోబోతున్న చర్యలపై రివ్యూ నిర్వహించారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. లక్ష్యసాధనకు సంబంధించి ప్రతి జిల్లా స్థాయి అధికారి తమ పరిధిలో చొరవచూపాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కన్నప్ప జన్మస్థలిని దర్శించుకున్న హీరో విష్ణు

ప్రజాశక్తి,-రాజంపేట అర్బన్

పరమేశ్వరుడు పరమ భక్తుడైన కన్నప్ప జన్మస్థలి మండల పరిధిలోని ఊటుకూరులో అడుగుపెట్టి శివ, పార్వతులతో పాటు కన్నప్పను దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని సినీ హీరో మంచు విష్ణు పేర్కొన్నారు. భక్త కన్నప్ప పాత్రలో విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న సందర్భంగా శనివారం కన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరు గ్రామంలో వెలసిన మీనాక్షి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని విష్ణు సందర్శించారు. ఊటుకూరు గ్రామస్తులు బాణాసంచా పేలుస్తూ, మేళ, తాళాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయనను చూసేందుకు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సెల్ఫీ దిగేందుకు పోటీపడడంతో కోలాహలం నెలకొంది. రూరల్ సిఐ కులాయప్ప ఆధ్వర్యంలో గట్టి భద్రత ఏర్పాటు చేయడంతో సమస్యలేవీ తలెత్తకుండా విష్ణు కన్నప్ప దర్శనాన్ని ప్రశాంతంగా ముగించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు నాగ పృథ్వీరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఫణి భూషణరావు విష్ణుచే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని వీరభద్ర స్వామి, భైరవుడు, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలను సందర్శించి చివరగా కన్నప్పను దర్శించుకుని ప్రదక్షిణాలు చేశారు. అనంతరం విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ కన్నప్ప పాత్రలో నటించడం, కన్నప్ప జన్మస్థలికి వచ్చి ఆయనను సందర్శించుకోవడం తనకు మాత్రమే దక్కిన భాగ్యమన్నారు. ఇంతటి విశిష్టమైన చరిత్ర కలిగిన కన్నప్ప ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని గ్రామ పెద్దలకు హామీ ఇచ్చారు. ఈ నెల 25న కన్నప్ప సినిమా విడుదల కానున్నదని, మహా భక్తుడైన కన్నప్ప చరిత్రను నేటి తరానికి తెలియజేయాలన్న సత్సంకల్పంతో ఈ చిత్రం చేశానన్నారు. ప్రతి ఒక్కరు ఈ చిత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు ఆర్.సతీష్‌రాజు, ఊటుకూరు గ్రామస్థులు ఎం.లక్ష్మీకర్‌రెడ్డి, వి.రాజా, జె.నాగేశ్వరరాజు, ఆర్.శ్రీనివాసరాజు, ఎస్.నరసింహులు, జి.వెంకటయ్య, బి.సుబ్బరామరాజు, ఆర్.సుబ్బరాజు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.నరసారెడ్డి పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న హీరో మంచు విష్ణు


ప్రమాణం చేస్తున్న కలెక్టర్, ప్రత్యేకాధికారి, అధికారులు

స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌చంద్

ప్రజాశక్తి - రాయచోటి

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రత్యేకాధికారి అగర్వాల్ వినయ్‌చంద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో డైట్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌తో శ్రీధర్‌తో కలసి పాల్గొని పరిశీలించారు. విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మండపంలో అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రారంభించిన వినూత్నమైన కార్యక్రమం అన్ని ప్రాంతాల్లోనూ ప్రతినెలా మూడో శనివారం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం పునర్ వినియోగ వస్తువుల ప్రోత్సాహానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసు, ఆలయ ఇఒ విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రం శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు, ఔత్సాహిక వ్యవస్థాపకులలో మేధో సంపత్తి హక్కుల (ఐపిఆర్) గురించి అవగాహన, అవగాహన పెంచడం లక్ష్యంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రం డైరెక్టర్ అశోక్ దొప్పలపూడి మాట్లాడుతూ పేటెంట్లు, కాపీరైట్‌లు, ట్రేడ్ మార్క్‌ల యొక్క ముఖ్య అంశాలను హైలైట్ చేశారు. భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఐపి ల్యాండ్‌స్కేప్‌పై విలువైన అంతర్దృష్టులను అందించారు ప్రతి కళాశాలకు పేటెంట్ ఉత్పత్తి పరిశోధన బలమని, అందులో ఉన్న లోతును, విస్తృతిని వివరించారు. పేటెంట్లు ఆవిష్కరణ, వాటి యొక్క పనితీరుతో సంబంధం ఉన్న మేధో సంపత్తిని రక్షిస్తాయని, అది ఎలా పనిచేస్తుంది ఎలా తయారు చేశారు, ఎలా ఉపయోగించబడుతుంది అనే అంశాలను వివరించారు. యుటిలిటీ పేటెంట్ యంత్రాలు, ప్రక్రియలు, పదార్థం యొక్క కూర్పులు, తయారీ వస్తువులు వంటి విస్తృత శ్రేణి ఆవిష్కరణలను కవర్ చేస్తుదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. తులసిరామ్ నాయుడు, కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శివయ్య పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశాభివృద్ధి శూన్యం

- మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతామోహన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 11 ఏళ్ల పాలనలో పదివేల జతల దుస్తులు మార్చాడే తప్ప దేశాభివృద్ధికి చేసింది శూన్యమని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెను స్వర్గలోకంగా అభివర్ణించారు. ఇక్కడున్న వాతావరణం ప్రపంచంలో ఎక్కడా లేదని తెలిపారు. 1905లో ఆంగ్లేయులు శానిటోరియం వద్ద టిబి ఆస్పత్రిని నెలకొల్పి ఎన్నో వేల ప్రాణాలు కాపాడారని వివరించారు. ప్రపంచంలో ఎక్కడా టిబికి చికిత్స లేదని, ఆ వ్యాధి సోకిన వారు మరణించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అలాంటి సమయంలో సానిటోరియం వద్ద టిబి ఆస్పత్రిని ఏర్పాటు చేసి ఎన్నో వేల ప్రాణాలు కాపాడారని కీర్తించారు. ఇక్కడున్న వాతావరణం అలాంటిదని, ఇక్కడి చెట్లు ఇచ్చే ఆక్సిజన్ ద్వారానే టిబి వ్యాధిగ్రస్తులు నయమయ్యే వారని, అలాంటి టిబి శానిటోరియం నేడు అధ్వాన్నస్థితికి చేరుకోవడం చాలా బాధాకరమని, కన్నీటిని తెప్పిస్తోందన్నారు. అదేవిధంగా మదనపల్లి బిటి కాలేజ్ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇక్కడికొచ్చి కాలేజ్ ప్రిన్సిపల్‌గా ఉన్న బిసెంట్‌తో చర్చించి, ఇక్కడే జాతీయ గీతాన్ని ఆలపించారని ఇంతటి మహోన్నతమైన బిటి కాలేజ్ నేడు అధ్వాన్న స్థితికి చేరిందంటే కేవలం నాయకుల నిర్లక్ష్యమేనని చెప్పుకొచ్చారు. సనాతన ధర్మం అంటే గంగా నదిలో మునగడం, ఊగిపోవడం, అయోధ్యలో దండం పెట్టడం కాదని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి వ్యంగాస్త్రాలు సంధించారు. అంటరానితనం నిర్మూలన, దళితులకు దేవాలయ ప్రవేశం, స్వతంత్రోద్యమంలో అందరికీ సమానత్వం కల్పించడం, టిబి శానిటోరియం, బిటి కాలేజ్‌లను పునరుద్ధరించడమన్నారు. ప్రజలు జగన్‌కు భయపడే కూటమి ప్రభుత్వంకు అధికారం ఇచ్చారు తప్ప, పవన్ కల్యాణ్ చెప్పుకొంటున్నట్లు వందశాతం స్ట్రైక్‌రేట్ కాదన్నారు. కాంగ్రెస్ పాలనలో భూ సంస్కరణలు తేవడం, బ్యాంకులను జాతీయకరణ చేయడం జరిగిందని, మోడీ పాలనలో ఒక్కటంటే ఒక్క సంస్కరణ కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. అధికారం కోసం జగన్ పగటి కలలు మానుకోవాలని, తానేదో తిరిగి అధికారం చేపడతానని అనుకోవడం ఆయన మూర్ఖత్వమేనన్నారు. ప్రజలను ఒక్క అవకాశమే అడిగారని, అది అయిపోయిందని, ఇక జగన్ అధికారంలోకి రావడం కలే నన్నారు. కేంద్రం లోని పెద్దలు కుల, మత ప్రాంతీయ భేదాలు సృష్టించి విష బీజాలు నాటుతున్నారని జాగ్రత్త పడకపోతే ముప్పు తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణకు తాను వ్యతిరేకమని, ఇది రెండు వర్గాల మధ్య పెద్దలు పెడుతున్న చిచ్చుగా అభివర్ణించారు. చంద్రబాబు చాలా జాగ్రత్తగా ఉండాలని, వర్గీకరణకు ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడం తగదన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజ్‌ను ప్రయివేట్ పరం చేయకూడదని, ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కాన్షీరామ్ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం కట్టబెట్టేందుకు తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ప్రజలకు సేవ చేయడమే పరమావధిని సూచించారు.

బహుజన బాంధవుడు కాన్షీరామ్

ప్రజాశక్తి-పీలేరు

బహుజన రాజ్యపితామహుడు కాన్షీరామ్ అని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. శనివారం పీలేరు బాస్ కార్యాలయంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ 1934 మార్చి 15వ తేదీన పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా కావాస్ పూర్ గ్రామంలో హరి సింగ్, బీసన్ సింగ్ కౌర్ దంపతులకు జన్మించి, ఉన్నత విద్యాభ్యాసం చేసిన కాన్షీరామ్ రక్షణ శాఖలో సైంటిస్ట్‌గా పని చేస్తూ అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని చదివి, దాని ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడని చెప్పారు. తరతరాలుగా బహుజనులను అణిచివేస్తున్న కుల వివక్షను ఎదిరించి బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహానేత, బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్షీరామ్ అని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలగన్న బహుజన రాజ్యం కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహోన్నత ఉద్యమ శిఖరం ఆయన అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, పల్లెపోగు హరినాథ, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, సంధిపాగు రామకృష్ణ, హరీష్, కిషోర్, బాలకృష్ణ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** బహుజనుల రాజ్యాధికార దిక్సూచి కాన్షీరామ్ అని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు అన్నారు. శనివారం కాన్షీరామ్ 91వ జయంతి వేడుకలను స్థానిక మెట్రో కాంప్లెక్స్ వద్ద బహుజనసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటం వద్ద ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పుట్టిన ఊరును, కన్న తల్లిదండ్రులను వదిలిన మహనీయుడు కాన్షీరామ్ అని కొనియాడారు. రాజ్యాధికారం కోసం అచంచలమైన రాజకీయ ప్రయోగాలు చేసి, అధికారాన్ని చేపట్టి, బహుజనులు కోల్పోయిన హక్కులను తిరిగి సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. కాన్షీరామ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరప్రదేశ్ ఫార్ములాను ప్రయత్నిస్తే ఇక్కడున్న మేధావులు ఆయన భావాన్ని అర్థం చేసుకోలేక విఫలం చెందారని ఆవేదన చెందారు. ఆనాటి నష్టాన్ని నేటికి ఏపిలో బహుజనులు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా బహుజన సిద్ధాంతాన్ని, కాన్షీరామ్ మార్గాన్ని, బహుజనులను ఐక్యం చేసుకొని రాజ్యాధికారం వైపు నడవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రూపక్ నాయక్, భానుప్రకాష్ వర్మ, పట్టణ నాయకులు మావిళ్ళ వెంకటేష్, జెన్నీత్, షాలేం, భరత్ పాల్గొన్నారు. బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బాస్ కార్యాలయంలో కాన్షిరామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాన్షిరామ్ చిత్రపటానికి నేతలు పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానంతో - కాన్సీరాం పని విధానంతో అవిశ్రాంత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ, మైనార్టీ వింగ్ కన్వీనర్ టి.ఎ.పీర్ బాషా, ఉద్యమ గాయకుడు సొన్నికంటి రెడ్డెప్ప, టౌన్ ప్రెసిడెంట్ బురుజు రెడ్డిప్రసాద్ తోపాటు బాస్ నాయకులు క్రాంతి, జి.వి. రమణ, తలారి కృష్ణ, జనార్దన్, బి.నరసింహులు, రాజేష్, సురేష్, తరుణ్ పాల్గొన్నారు.


పీలేరు : కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఎంఇఒలు

బాలికల జూనియర్ కళాశాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి బాలికల జూనియర్ కళాశాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న బాలికల జూనియర్ కళాశాల రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుడుతున్న సందర్భంలో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారు కరపత్రాలను ముద్రించి ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి, మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంతకృష్ణ, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, శిల్పి ఆనందాచారి, జివి.ప్రసాద్ రావు, గంగనపల్లి వెంకటరమణ, రవిశంకర్‌రెడ్డి, నాగశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, మస్తాన్, విజయ కుమారి, తులసీ స్వర్ణలత, పాలేటి సుబ్బరాయుడు, వెంకటరమణ, ఆర్‌వి.రమణమ్మ, గౌరీ, సిఆర్‌పి జ్యోతి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-వీరబల్లి

ఈనెల 17న జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని పూర్తి ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మార్ల ఓబుల్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం రెండు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రెండు కేంద్రాలలో మొత్తం 366 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులంతా ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఒక్కొక్క విద్యార్థికి ఒక డెస్క్ చొప్పున సీటింగ్ కేటాయించామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన ఫ్యాన్లు, వెలుతురు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించినట్లుతెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో పోలీసు సిబ్బంది 144 సెక్షన్ అమలు పరుస్తారన్నారు. కాబట్టి పరీక్షల నిర్వహణ సమయంలో పరీక్షా కేంద్రం సమీపంలోకి ప్రజలు ఎవ్వరూ రాకూడదని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోనికి తీసుకురావడం నిషేదమని చెప్పారు. పరీక్షా కేంద్రంలోనికి చిట్టీలు, పుస్తకాలు కానీ తీసుకొని రావద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అందరూ సహకరించాలని కోరారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆర్అండ్‌బి స్థలంలో సర్వే

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆర్అండ్‌బి స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు శనివారం మండలంలోని ఎస్ఆర్ పాలెంలో ఆర్అండ్‌బి, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఫిర్యాదు దారుడు దుగ్గి గంగాధర్ సమక్షంలో ఆర్అండ్‌బి హద్దులకు మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆర్అండ్‌బికి సంబంధించి స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు జరిపారని ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదు పరిష్కరించేందుకు తాము ఆర్అండ్‌బికి సంబం ధించి హద్దులను నిర్ణయించామని అన్నారు. ఇందులో కొంతమేర ఆక్రమణలు జరిగినవి వాస్త వమేనని, కొంతమంది ఆర్అండ్‌బికి చెందిన స్థలాలలో గృహాలను నిర్మించుకొని ఉన్నారని, ప్రస్తు తం కొలతలను, హద్దులను నిర్ణయించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముం దుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల సర్వేయర్ శ్రీరాములు, సచివా లయ సర్వేయర్లు శశిధర్, శ్యామల, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్ష శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు దీప్ లాడ్జ్ ఎదురుగా గల రత్న స్పీచ్ అండ్ హియరింగ్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పీచ్ థెరపిస్ట్ బాబురావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినికిడి పరీక్షలతో పాటు ఆర్‌సిఐ సర్టిఫైడ్ థెరపిస్ట్లచేఉచితంగా స్పీచ్ స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలన్నీ ఉచితంగా ఆది సొసైటీ ఫర్ అప్లిమెంట్ ఆఫ్ రూరల్ ఎకానమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. అత్యాధునిక వినికిడి యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని వారు కోరారు.


నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... సామకోటవారిపల్లి పంచాయతీ సామకోటవారిపల్లెకు సమీపంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.3420లు నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముక్కంటేశ్వరుని కల్యాణోత్సవం

ప్రజాశక్తి - రామసముద్రం



ప్రత్యేక అలంకరణలో ముక్కంటి వేంకటేశ్వరుడు

మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో వెలసివున్న ముక్కంటేశ్వరుని ఉత్సవాలు గత మూడు రోజులుగా భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం అతి వైభవంగా వేదపం డితుల చేత శ్రీ పార్వతి సమేత ముక్కంటేశ్వరుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి స్వామివారి రథోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నడుమ బళ్లారి డ్రమ్ముల,కేరల వాయిద్యాలు, దేవరెద్దులు చెక్కల భజనలు, కోలాటాలు, భజనలు నడుమ స్వామి వారి రథోత్సవం వైభవంగా జరగనుందని గ్రామస్తులు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



పీలేరులో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, అధికారులు



కలకడ : పట్టణంలో మానవహారం చేపట్టిన అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి నిర్వహించారు. ఈనెల సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంపిడిఒ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించామన్నారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వాడకం నిషేధం పై నినాదాలు చేశారు. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సదరు చిరు వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. తర్వాత ర్యాలీ నందు పాల్గొన్న వారిచే స్వచ్ఛ ఆంధ్ర పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఒ రమేష్‌బాబు, ఎపిఒ రమేష్, ఎఇ మిథున్ చక్రవర్తి, టిడిపి నాయకులు రాజన్న, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.య **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మూడవ శనివారం సందర్భంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ కూడలి వద్దకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భారీ ర్యాలీగా నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి,చిరు వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండలప్రత్యేక అధికారి భరత్ కుమార్‌రెడ్డి, ఎంఇఒ మునీంద్రనాయక్, కలకడ సర్పంచ్ టి.పారిజాన్, జావాద్ అలీఖాన్, బాలయ్యగారిపల్లి సర్పంచ్ కె విశ్వనాథనాయుడు, మండల కో-ఆప్షన్ సభ్యులు ఇనయతుల్లా, టిడిపి ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, జిరాక్స్ అల్లి, జిలానిబాషా పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమం సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై పంచాయతీ సిబ్బంది సచివాలయ సిబ్బంది ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని జ్యోతి బస్టాండ్ వద్ద కమిషనర్ జీవి పల్లవి, హార్సిలీహిల్స్ క్రాస్ వద్ద ఎంపిడిఒ దిలీప్ కుమార్, అన్ని పంచాయతీ కార్యాలయాలలో గ్రామపంచాయతీ ప్రజలచే స్వచ్ఛ గ్రామసభను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సభలో పాల్గొన్న వారిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ వినియోగం కలిగే అనర్థాల గురించి వివరిం చారు. కార్యక్ర మంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ పిఒ నాగ, నవీన్‌కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మనం ఉంటున్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. కొత్త బోయినపల్లి ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ-విద్యా ర్థులు, ఉపాధ్యాయులు పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి, ర్యాలీ నిర్వహించి తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పించి వి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. **రామాపురం :** రెవిన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కృపావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్‌ఖాన్, విఆర్ఒలు, విఆర్ఎలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పీలేరు ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ - దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపిడిఒ శివశంకర్, టిడిపి శ్రేణులు, పారిశుధ్య కార్మికుల సంయుక్త ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఓవైపు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, మరోవైపు ప్రజారోగ్యాన్ని కాపాడుకుంటూ, ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిది ద్దడానికి, పర్యావరణాన్ని రాడానికి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. టిడిపి రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామూర్తి మాట్లాడుతూ ప్రజలు బాధ్యతగా వ్యవహరించి వ్యర్థాలు, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా పంచాయతీ వాహనం వచ్చినప్పుడు వేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ ప్రముఖ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, ఇఒపిఆర్‌డి లతీఫ్ ఖాన్, చాంద్ బాషా, సురేష్, పంచాయతీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. **నందలూరు :** ప్లాస్టిక్ కవర్ల నిషేధం మనందరి బాధ్యత అని నందలూరు మండల స్పెషల్ ఆఫీసర్ రామచంద్రనాయక్, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిడిఒ రాధాకృష్ణ, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. అన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా రోడ్లు, భవనాల అతిది గృహం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ కూడలి లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, ఇఒఆర్‌డి సునీల్, ఎంఇఒనాగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకట రమణ, ఉపాధి హామీ ఎపిఒ మురళీ, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక మహిళు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి

సారా తయారీ నియంత్రణపై అవగాహన



సారా నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న జోగేంద్ర

ప్రజాశక్తి-కలకడ

సారా తయారీ నియంత్రణపై అవగాహన కల్పించినట్లు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర పేర్కొన్నారు. మండలంలోని దిగుతాండ పంచాయతీ దిగువ తండాలో ఎస్‌టిలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం నేరమని ఆయన పేర్కొన్నారు. నాటు సారా తయారుచేసి జీవనోపాధి పొందడం చట్టపరంగా నేరమని ఆయన సూచించినట్టు తెలిపారు. మీ జీవనోపాధి కోసం కలెక్టర్‌కు మీ సమస్యలు తెలిపే మీకు ప్రభుత్వం నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్టు తెలిపారు.నాటు సారా తయారు చేయడం, అమ్మకాలు చేయడం జీవితాలతో ఆడుకోవడమేనని తెలిపారు. నాటుసారా తాగడం వల్ల జబ్బుల బారిన పడడం, ప్రాణాలను కోల్పోవడమే కాకుండా ఇంటి యజమానులను పోగొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి చెడు వ్యసనాలకు లోను కావడం వల్ల దొంగతనాలు వంటి నేర ప్రవృత్తికి అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఎక్సైజ్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చైతన్య, పంచాయతీ కార్యదర్శులు జయచంద్ర, శివకుమార్, విఆర్ఒ మహబూబ్ బాషా, గ్రామస్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

టిడిపి కార్యకర్త దారుణ హత్య

-బాధితులతో ఫోన్‌లో మాట్లాడిన హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

తెలుగుదేశం పార్టీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాడు. వైసిపికి చెందిన కొందరు తమపై కక్ష పెంచుకొని హత్య చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. టిడిపి సానుభూతి పరులమని తమపై క్రమంగా వైసిపి కార్యకర్తలు దాడులు చేస్తున్నా పోలీసులు మాత్రం తాము ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వల్లే ఇంత దారుణం జరిగిందని ఆరోపించారు. మృతుడి భార్య ఉమాదేవి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లె, పంచాయతీ కృష్ణాపురంకు చెందిన కాగితి రామకృష్ణ రైతు, టిడిపి కార్యకర్త. ఇదే ప్రాంతానికి చెందిన వైసిపి కార్యకర్త వెంకటరమణ, ఇతని భార్య వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్‌గా ఉండేది. కొంత కాలంగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నిందితుడు వెంకట్రమణను వైసిపి నాయకులు వేమారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గణపతి, మహేష్ రెచ్చగొట్టి, మేమున్నాం చూసుకుంటామని చెప్పడం వల్లే శనివారం ఉదయం దుకాణం వద్ద ఉన్న రామక్రిష్ణ కొడుకు సురేష్‌పై వేటకొడవలితో దాడి చేశాడని తెలిపారు. సురేష్ తప్పించుకునే ప్రయత్నంలో చేతిపై కొడవలి వేటు పడడంతో గాయం కాగా, రక్తస్రావంతోనే పరుగులు పెట్టాడని అన్నారు. పొలం పనుల్లో ఉన్న తండ్రి రామకృష్ణకు విషయం తెలియడంతో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్‌తోనే పరుగున గ్రామంలోకి చేరుకున్నాడని అన్నారు. కుమారుడిపై వేటకొడవలితో తరుముతున్న వెంకటరమణను అడ్డగించి ప్రతిఘటించగా వెంకట్రమణ అదే కొడవలితో రామకృష్ణపై దాడి చేశాడని అన్నారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న రామకృష్ణను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించే లోపు మృతి చెందాడు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్లే ఇంత దారుణం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డు పై బైఠాయించి, ధర్నా, రాస్తోరోకో చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె సిఐలు ఎరిషావల్లి, కళా వెంకట్రమణ ఎంత చెప్పినా ఆందోళన విరమించలేదు. పుంగ నూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లాబాబు తాను అండగా ఉంటానని బాధితులకు చెప్పడంతో ఆందోళన విర మించారు. బాధితులతో హోంమంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరా మ్ చినబాబు జరిగిన సంఘ టనను హోం మంత్రి అనితకు వివరించడంతో కార్యకర్త లకు భరోసా ఇస్తూ నింది తులను కఠినంగా శిక్షించ డంతో పాటు బాధి తులకు న్యాయం చేస్తామని భరోసా కల్పిం చారు. టిడిపి కార్యకర్త రామ కృష్ణ హత్య పూర్తిగా రాజకీయ హత్యేనని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పుంగునూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లాబాబు, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు మద నపల్లె ప్రభుత్వాసు పత్రికి వచ్చారు. మార్చురీలో ఉన్న రామకృష్ణ మృతదే హాన్ని పరిశీలించి, దాడిలో గాయపడిన మృతుడి కుమారుడు సురేష్ ను పరామ ర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



రామకృష్ణ(ఫైల్ ఫొటో)



గాయపడిన సురేష్

సిఐపై సస్పెన్షన్ వేటు

పుంగునూరు మండలం కృష్ణాపురం చెందిన హత్యకు గురైన రామకృష్ణ నాయుడు ఇచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేసినందుకు పుంగనూరు సిఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంను సస్పెన్షన్ వేటు పడింది. వారిద్దరినీ సంస్పెండ్ చేస్తూ చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు.

వైసిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా కరీముల్లా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఎ. కరీముల్లా ఎంపికయ్యారు.ఈ మేరకు పార్టీ అధిష్టానం శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో వచ్చే ఎన్నికలలో వైసిపి జండా ఎగురుతుందని కరీముల్లా పేర్కొన్నారు. శనివారం మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2029లో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్, మదనపల్లి ఎమ్మెల్యేగా నిస్సార్ అహ్మద్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పదవి దక్కడానికి సహకరించిన మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



ఆపరేషన్ చేయించుకున్న వారికి అద్దాలు ఇస్తున్న వైద్యులు

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ముక్కా రూపానంద రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తిరుపతిలోని ఎస్.వి అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గత నెల 9న పుల్లంపేట ఎస్‌బివిడి సభా జూనియర్ కాలేజీలో దాదాపు 300 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆపరేషన్ చేయించుకున్న వారికి శనివారం మరల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అందరికీ శ్రీముక్కా వరలక్ష్మి తనయుడు సాయి వికాస్‌రెడ్డి, విశాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఇక్కడికి విచ్చేసిన వారందరూ రూపానందరెడ్డి కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల టిడిపి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు, టిడిపి నాయకులు సింగం ఆదినారాయణ రెడ్డి, సింగమాల విశ్వనాథరెడ్డి, ఎస్.వి.అరవింద్ కంటి ఆసుపత్రి డాక్టర్. చైతన్య, క్యాంప్ ఇన్‌ఛార్జి గౌరీ శంకర్, జగదీష్, భువన, మేనక, యమున పాల్గొన్నారు.

పశువుల సంత వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత ఈనెల 20కి వాయిదా వేసినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పశువుల సంతతో పాటు బస్టాండ్ గేటు వేలం శనివారం సాయంత్రం 3గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో బహిరంగ వేలం పాట నిర్వహించారని ఈ వేలం పాటలో సభ్యులందరూ ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఎక్కువగా ఉందని సభ్యులు ఎవరు పాట పాడలేదన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం మూడు గంటలకు మళ్లీ వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. 20న జరిగే వేలంపాటకు సభ్యులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.



ముస్లిము మత పెద్దలకు నగదు అందజేస్తున్న సిబ్బాల దినకర్

మసీదులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరిలోని మసీదులకు ఆర్థిక సాయం అందించి మరోసారి మతసామరస్యం చాటుకున్నాడు కురవపల్లికి చెందిన సిబ్బాల దినకర్. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కలికిరిలోని పలు మసీదుల అభివృద్ధి కొరకు పదివేల రూపాయలు చొప్పున ఏడు మసీదులకు రూ.70వేలు ముస్లిం మత పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఒక పవిత్ర మాసంగా భావిస్తారని, గుడి, మసీదు, చర్చి, ఏదైనా మన జీవన విధానంలో ఒక భాగం అని వాటిని పరిరక్షణ మన బాధ్యతని అన్నారు. కలికిరిలోని మసీదు ల నిర్వహణకు తన వంతు సహాయం గా కొంత నగదు విరాళంగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం ఇచ్చిన మసీదు పెద్దల కు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రహంతుల్లా, టిడిపి మండలం అధ్యక్షులు నిజాం, చిన్న, అస్లాం ఖాదరవాలి, శబరి పాల్గొన్నారు.

నా ఇంటిని కూల్చేసి నాపైనే కేసులు

-న్యాయం చేయాలంటున్న బాధితుడు బాల్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంటే అక్రమణ దారులు తన ఇంటిని కూల్చేసి తనపైనే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని బాధితుడు బాల్‌రెడ్డి ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం ప్రెస్‌క్లబ్‌లో తన గోడును వెల్లబోసుకున్నాడు. ఈ సందర్భంగా బాల్రెడ్డి మాట్లాడుతూ.. 2004లో ప్రభుత్వం నాకు సర్వేనెంబర్ 539/2 లో రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని కేటాయించిందన్నారు. తనకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇన్నాళ్లు ఇంటికి నిర్మించుకోలేకపోయానని, ప్రస్తుతం తాను ఇంటిని నిర్మించుకుంటే అదే ప్రాంతంలో ఉంటున్న సునీత, కృష్ణ నాయక్ దంపతులు ఆ స్థలం తమదని తనపై దాడికి తెగబడి గొడవలు సృష్టిస్తున్నారన్నారు. తాను పోలీసుల ప్రొటెక్షన్‌తో ఇంటిని నిర్మించుకున్నప్పటికీ ఇంటిని పడదోసి తనపైనే, అక్రమ కేసులు బనాయించారన్నారు. తాను దాడి చేసినట్లు, కులం పేరుతో దూషించినట్లు తప్పుడు ఫిర్యాదులు చేశారని, అయితే పోలీసులు తప్పుడు ఫిర్యాదులు గా గుర్తించ కొట్టివేశారన్నారు. అయినప్పటికీ సునీత, కృష్ణా నాయక్ దంపతుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించడంతోపాటు తన స్థలం సమస్యను పరిష్కరించి, ఆక్రమణ దారులు ఆ స్థలం జోలికి రాకుండా న్యాయం చేయాలని కోరారు.పోలీసు అధికారులు రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బకాయిల వసూళ్లకు వినూత్న ప్రయోగం

బకాయిదారుల దుకాణాల ముందు అధికారులు, కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామపంచాయతీలో పేరుకు పోయిన మొండి బకాయిల వసూళ్లకు పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు, కార్మికులు కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. పన్ను రూపంలో తమకు బకాయి ఉన్న వారి దుకాణాల ముందు శనివారం ప్లకార్డులతో నిరసనకు దిగారు. సకాలంలో పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులను సకాలంలో కట్టి తమకు జీతాల చెల్లింపుతో పాటు పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ నినాదాలు చేశారు. పీలేరు గ్రామ పంచాయతీలో రూ.1.60 కోట్ల వేరకు మొండి బకాయిలు పేరుకు పోయాయి. పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది, తమ కార్మికులతో కలిసి బకాయిదారుల దుకాణాల ముందు తమ నిరసనలను వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో తాము కాసింత ఆలస్యంగా చెల్లిస్తే చిటపడలాడే అధికారులు, సిబ్బంది బడాబాబులు ఏళ్లకు ఏళ్లు పన్నులు ఎగ్గొడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. పీలేరు గ్రామ పంచాయతీకి ఇప్పటి వరకు అధికారికంగా రూ.1,61,40,091ల పన్ను బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరింత సునిశితంగా లెక్కలు వేస్తే అది రూ.2 కోట్ల దాకా ఉంటుందని కిందిస్థాయి సిబ్బంది అంటున్నారు. పీలేరు గ్రామ పంచాయతీకి 2024-25 ఆర్థిక సంవత్సవరానికి రూ.1.96,08,493ల ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉండగా దానికి సమానంగా బకాయిలు ఉండడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాసింత నోరు, కాసింత ఆర్థిక బలం వారు ఏళ్లకు ఏళ్లు పంచాయతీకి పన్నులు చెల్లించకపోవడంతో అది వందలు, వేలు దాటి లక్షలకు చేరుకుంది. పీలేరు మాజీ, ప్రస్తుత సర్పంచులు, వారి బంధువులు, ఓ ప్రముఖ విద్యాసంస్థ, ఎస్.బి.ఐకి అద్దెకిచ్చిన భవనం, మండల ప్రజాపరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ రూములు, నాలుగు రోడ్ల కూడలిలోని వాణిజ్య సముదాయం కలిపి రూ.20 లక్షల దాకా బకాయి ఉన్నట్లు పంచాయతీ సిబ్బందితెలిపారు.మొండి బకాయిల వసూళ్లకు అధికారులు శనివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పీలేరు అజంతా టాకీసు మిట్ట మీద ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ అద్దె భవన యజనామాని రూ.8 లక్షల మేరకు పన్నుల బకాయి ఉండడంతో పీలేరు. ఈవోపీఆర్‌ఆర్డీ లతీఫ్ ఖాన్ నేతృత్వంలో పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. బకాయిల కారణంగా పంచాయతీ అభివృద్ధి కుంటుపడడమే కాకుండా తమకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్లకార్డులు చేత బూని వారి బ్యాంకుఎదుట నిరసనకు దిగారు. నిరసనలకు కూడా లొంగకపోతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని పీలేరు ఇఒ గురుమోహన్ తెలిపారు.